# గొలుసు



ఆకెళ్ళ వెంకట సూర్యనారాయణ

“పళ్ళు చూసి గొడ్డుని, వంశాన్ని చూసి బిడ్డని తెచ్చుకోవాలని ఊరికే అన్నారా? ఓ ఇంటి నుంచి ఆడ బిడ్డని.... మనింటికి తెచ్చుకోవాలి అంటే ఎన్ని చూసుకోవాలి. ఆ పిల్ల మనింటి కోడలై మన వంశాన్ని నిలబెడుతుందా? వంశానికి వంకర తెస్తుందా- చూసుకోవద్దా? ఆడపిల్లకి అందం కాదు ఆభరణం. అణకువ- వినయం- గౌరవం- మర్యాద-అవీ ఆభరణాలు. అసలా చమురుకాళ్ళ పెద్దమ్మ చుట్టూ

చొంగ కారుసూ వీడు తిరగబట్టే కదా! అదలా పెత్తనాలు వెలగ బెట్టిందీ?

అక్కడికి ఆ మహాతల్లి కాపరానికి కుడికాలు పెట్టిన రోజున చెప్పాను ఈ చవట సన్నాసికి. ఎక్కడో పుట్టి ఎక్కడో పెరిగి గుప్పెడు మెతుకుల కోసం మనింటికి చేరిన నీ పెళ్ళాం కాదురా, ఈ ఇంటి పెత్తనం వెలగబెట్టాల్సింది? నువ్వు. నీమాట చెల్లుబాటు కావాలి. నువ్వు మగమహారాజువి. ఆదిలో నెత్తి కెక్కించుకుంటే ఆనక అదక్కడే తాండవమాడుతుంది కానీ దిగదురా అని చెప్పాను. విన్నాడా? అబ్బే ఎందుకు వింటాడు. దాని వయసు, దాని మిసమిసలు, తళుకులు, బెళు కులు చూసి వీడి కళ్ళు మూసుకు పోయాయి. 'ఈ వెర్రి మగడు మన కాలి కింద బంటు. మన మాట జవ దాటడు అని దానికి అర్థమైపోయింది. ఇంక ఊరు కుంటుందా? దాని పెత్తనం అది వెలగబెట్టేసింది.

అసలాడదాన్ని ఎక్కడుంచాలో అక్కడుంచాలి. అసలే ఆదిశక్తి, దానికి అలుసు ఇస్తే నెత్తికెక్కే పిందే. ఈ తల్లిముండ అను భవంతో చెబుతోందని ఏమైనా తల కెక్కించుకున్నాడా? లేదే? ఇప్పు డిక ఏం ఏడిస్తే లాభం. చేతులు కాలేక ఆకులు పట్టుకోవటమే.

పుల్లేటికుర్రు నించి పదివేల రొక్కం అరెకరం కొబ్బరితోట ఇస్తామని ఆ పెద్దమనిషి అరు చెప్పులు అరి గేలా తిరిగేడు. వింటేగా? ప్రేమా- పిండాకూడు- వల్లకాడు. వశం దిబ్బాని ఈ కొరకరాని కొయ్యను తీసుకొచ్చి కోడలిగా తెచ్చి, ఈ కొంపలో పారేశాడు.

పోయినవాళ్ళు పోగా ఉన్న ఒక్క మగనలుసు నేను కాదుకూడదంటే దేశాలట్టుకుని పోతాడని కదా- ఆ సంబంధానికే ఒప్పుకుంటి? నువ్వు ఎరగనిదా? ఆ పెళ్ళి ఎంత గొప్పగా చేశారో? అయిదు రోజుల పెళ్ళి. ఆకాశమంత పందిరి- భూదేవంత పీటాని--మిన్ను విరిగి మీద పడేలా కబుర్లు చెప్పాడు దాని బాబు.

తీరా చేసి పెళ్ళివారమంతా కలిసి అరవై మందిమే. మూడు రోజులకే కాళ్ళు జాపేశాడు. పుస్తెముడి పడింది. రామా! నీకు అబద్ధం. నాకు నిజం. కాస్త సరయిన కాఫీ కూడా పంపలేదు ఏదడిగినా లేదనే శబ్దమే. మా పెదనాన్న అల్లుడ్ని నువ్వు ఎరుగుదువుగా! అతగాడు- అరగంటకో ఓవల్టీన్ తాగుతాడు. మూడు రోజులు బాగానే పంపేరమ్మా! పుస్తె ముడి

పడిపోయిందిగా. ఇక పట్టించుకున్న వాడే లేడు. అతగాడ్ని సమాధాన పర్చేసరికి మా తల ప్రాణం తోకకి వచ్చింది. బంధుత్వానికొస్తారు గానీ అన్నం లేక వస్తారుటమ్మా! వచ్చిన వాళ్ళకి అంత పిండాకూడు పెట్టలేనివాడు కూతురుకి పెళ్ళెం దుకు చేయటం? పుట్టగానే, వడ్లగింజ నోట్లో పడేస్తే వదిలిపోయే దిగా?

ఇంక చెప్పేదేముంది? ఒక్కగా నొక్క కొడుకని నేను ముచ్చట పడ్డందుకు ఆ పెళ్ళి అలా -- ఏ అచ్చటా ముచ్చటా లేకుండానే అయింది. ఉదయం వేళ వియ్యపురాలికిచ్చే వెండిబొట్టుపెట్టి, బంగారు పందుం పుల్ల- ఎంతలేని వాళ్ళయినా ఇస్తారు కదా? మా వియ్యాలవారు ఇచ్చారు, దర్భపుల్లలా వుంది ఆ పందుంపుల్ల. పావుతులంతో పానించి నా ముఖాన కొట్టారు. సర్లే- కడుపు చించుకుంటే కాళ్ళ మీద పడుతుందని రెండూ మూసుకొని ఊరుకున్నాను.

పిల్ల అణకువగా పడుంటే, అదే పదివేలనుకున్నాను. ఆడపడుచు అత్తగారు లాంఛనాలు, ఆరు పందలే ఇచ్చినా అదేమని అడగ లేదు. పోన్లే మనింటికొచ్చే పిల్లా, ఇప్పుడే అల్లరి పెడితే-- అత్తగారు గయ్యాళిదనుకుంటుంది- అని నోరెత్తలేదు.

పుట్టింటివారన్ని పొరపాట్లు చేసినా, కోడల్ని కూతురు కంటే మిన్నగా కడుపులోనే పెట్టుకున్నాను. ఆ గౌరవం తనేం ఉంచింగి. మాట మాత్రం నాతో ఏం చెప్పింది? కట్టుకున్న వాడున్నాడు. వాడితో ఒక సారి చెబుదాం అని అనుకుంది? తనిష్టమొచ్చినట్లు తను చేసేస్తుందా? ఈ మాట విన్నావో లేదో, తన పెళ్ళితో తన పుట్టింటివారు దిబ్బయి పోయారట. తన పురుడూ, పుణ్యాలతో వాళ్ళు బికారులయ్యారట.

ఆ మాట మన రామాయమ్మ కోడలి దగ్గర అందిట. పిన్నీ మళ్ళీ ఎక్కడా అనకూ అని చేతిలో చేయి వేయించుకుని చెప్పిందది.

బాపుందా! ఈ పెద్దూరం ఎక్కడైనా వుందా? నీకూ ఆడపిల్లలున్నారు. పెళ్ళి చేస్తావు. ఆ పిల్లని మూడో నాలుగో పురుళ్ళకి తీసుకొస్తావు, పోస్తావు. దానివల్ల నువ్వు దిబ్బయి పోతావా! ఎవడి కోసమమ్మా? నీ బాధ్యత నువ్వు చేస్తావు. నీ పిల్ల నీకు బరువటమ్మా! ఆలాగే, మా వియ్యంకుడు మా కోడలికి మూడు పురుళ్ళు పోశాడు. ఆ చేతి చలవో- ఆ పాపిష్టి డబ్బు దోషమో- ముగ్గురూ ఆడ ముండలే

పుట్టారు. నాలుగో పురుడుకి తీసు
కెళ్ళాడు. ఆదేం ఉద్ధరింపా!
లోకంలో ఎవరూ చేయటం లేదా?
ఆస్థిపాస్తులు పోయి అప్పుల్లో పడ్డా
డయ్యా. నిజమే! కూర్చుని తింటే
కొండలు తరుగుతాయి. అప్పుల్లో
పడ్డాడు. ఇల్లుమీద తనఖా వాళ్ళు
దావా తెచ్చేరు. నిజమే- అయితే
కూతుర్ని పురుడుకి పట్టుకెళ్ళడా?
అయ్యో! పట్టుకెళ్ళేడమ్మా! పట్టు
కెళ్ళలేదని నేననలేదు. పట్టుకెళ్ళాడు
కొంప ముంచాడు. ఆ ముండ
కొడుక్కి కూతుర్ని పురిటికి తీసి
కెళ్ళే వేళకే ఆ ఊహ వుందేమో
నాకు తెలియదు. ఉందని నాకు
ఏ మాత్రం అనుమానం తగిలినా
నేను ముందే జాగ్రత్త పడుదును.
నాకనుమానం కలగలేదు సుమీ ...
మగపిల్లాడు పుట్టాడు, మేమంతా
బారసాలకి వెళ్ళేంగా. లోపలేం
ఏడిచేరో, నాకో జరీచీర తగ
లెట్టారు కాస్త అంచు చిన్న
దైనా చీర బాగానే ఏడిపిందిలే.
అప్పుడే చూశాను మా కోడలికేసి.
ఏదే? ఆ గోవర్ధన గొలుసు ఏదే?
వేసుకోలేదేం? అనిఅడిగాను.
అబ్బో అది గుండెలు తీసిన బంటు.
దాన్ని మీదెడితే వానలు కిందెడితే
పంటలు వుండవు. ఏం చెప్పిందో
తెల్సునా?

"పెట్లో ఉందత్తయ్యా!" అంటూ
సన్నాయి నొక్కులు నొక్కింది.
నేనో వెర్రి ముండని, నమ్మేశాను.
బడబడా వాగేస్తానే కానీ, నాకేం
అంత తెలివితేటలు ఎక్కడ
చచ్చాయి.
సాయంత్రం పిల్లాడ్ని తొట్టిలో
పెట్టారు. నలుగురు ముత్తయి
దువ్వలు వచ్చారు. అప్పుడు కూడా
ఆవిడగారు [illegible] దేవిలా
తిరుగుతుంటే ఆరా తీసాను,
అప్పుడు బయటపడింది. మా
వియ్యంకుడి ఇంటి మీదకు డిక్రి
వస్తే మా కోడలి గొలుసు తాకట్టు
పెట్టి పీకల మీద కత్తి తప్పించు
కున్నారట.
ఈ విడ్డూరం ఎక్కడైనా విన్నా
వామ్మా? పుట్టింటికొచ్చిన ఆడబిడ్డ
సొమ్ము ఎవరైనా తాకట్టు పెట్టు
కుంటారా? ఇంత దారుణం ఎక్క
డైనా ఉందా? అడపడుచుకో పసుపు
కొమ్ము పెడతారు కానీ ఆడబిడ్డ
సొమ్ము అఠిస్తారా?
తాకట్టు ఏమిటమ్మా నా పిండాకూడు
ఇక అది వాకట్టే. ఆ వస్తువు ఆ
మార్వాడివాడు సొంతం చేసేసు
కుంటాడు. విడిపించటానికితగాడి
దగ్గర డబ్బెక్కడుంది? ఊళ్ళో
అప్పు కాదు కదా- ఉప్పు కూడా
పుట్టే పరిస్థితి లేదు. అందినంత

మేరా అప్పులు చేసి ఆడపిల్లల్ని
మసిపూసి, మారేడుకాయ చేసి,
అత్తారిళ్ళకి తోలేసి, మా వియ్యం
కుడు మంచం ఎక్కేశాడు. వాడి
మొహం మండా! వాడింకేం విడి
పిస్తాడూ?

మా వెఱ్ఱి వెధవ ఉద్యోగమంటే
పెలగబెడుతున్నాడు, కాని తెలివి
తేటలు ఎక్కడ ఏడ్చాయి? నాలుగు
తిట్లు తిట్టి వాడ్ని తీసుకుని చక్కా
వచ్చాను. వాళ్ళు కాళ్ళావేళ్ళా
పడ్డారు, పిల్లని తీసుకెళ్ళమని. నేను
ఒప్పుకోలేదు. నాకు పట్టుదలంటే
పట్టుదలే.

అయితే ఓ పని చేశాను. చేసిన
పని, పాపం చెబితే పోతుందం
టారు. ఆడదాన్నే! అంత ఘోరం
నువ్వు చేయకూడదన్నా, సరే కాని
నా ఖర్మకలా తోచింది. చేసి చక్కా
వచ్చాను. ఆ మెళ్ళో నానుతాడు
మంగళసూత్రం, నల్లపూసలు, చేతి
కున్న గాజులు ఊడలాక్కుని
చక్కా వచ్చేశాను. కావాలంటే
ఏ పసుపు కొమ్ముకో కట్టుకొని ఏడు
స్తుంది. అంతేకాని వాళ్ళ గుణాలు
తెలిసిన తర్వాత- అక్కడ వదిలేసి
చక్కా వస్తామా? పెళ్ళిలో వాళ్ళు
పెట్టినవే అయినా, పిల్లతో పాటు
మనకి కన్యాదానం చేసినవే కాద
టమ్మా! ఆంచేత అవి కాస్తా ఊడ
లాక్కుని చక్కా వచ్చాను. శుక్ర
వారం పూట అంత పని చేయడా
నికి నీ మనసెలా ఒప్పిందని నీవు
అన్నా సరే! చేసేశాను. దానికి
పసుపు పూసుకునే రాత ఉండాలి
కాని ఇంతలో ఏం కాదులే?

ఇదిగో అప్పటికిప్పటికి రెండేళ్ళు
అయింది. పిల్లని తీసుకెళ్ళమని
కబుర్లు పెట్టడమే కాని గొలుసు
విడిపించామనే మాట మాత్రం
లేదు. మా వియ్యంకుడు మంచం
ఎక్కేట్టా! అల్లుణ్ని చూడాలని కల
వరిస్తున్నాడట. కల్లబొల్లి కబుర్లు
చాలా వచ్చాయి. ఈ కబుర్లకు
కరిగిపోయి, పరుగులెడతామను
కుంటున్నారేమో! ఈ ఘటంలో
ఊపిరున్నంత వరకు ఆ పని
జరగదు.

పొద్దెక్కింది. కాస్త పిండాకూడు
వండి పడేయాలిగా? ఆ కోడలి
ముండ పుట్టింటికి చేరింది. ఈ
పుట్టెడు చాకిరి నా నెత్తిన పడింది.
వస్తాను. సాయంత్రం గుడి కొస్తా
వుగా? ఉంటానమ్మా!

o o o

పోసెయి గురూ! లార్జ్....అసలు
మందు దగ్గర మొహమాటం పనికి
రాదని, మార్క్స్ మహాశయుడు
అన్నట్లు గుర్తు. మార్క్స్ అనక
పోతే పేసే అన్నట్లు గుర్తు.

పోసెయి- పూర్తిగా పోసెయ్! అదిగో. బీరు కూడా కలుపు. కాక్ టైల్ చేశాయి. మగాడు బ్రాందీ అయితే ఆడది బీరు లాంటిదోయ్. రెండూ కలిస్తే కాక్ టైల్. ఇక చూస్కో. నరనరాల్లో హోరు, నిషా, మత్తు, మైకం. ఆ తర్వాత హేంగోవరు. నీరసం.

అసలు ఆడదాన్ని బీరుతో పోల్చడంలో మరో ఔచిత్యం వుంది. యస్. ఆడది బీరు బాటిల్ లాంటిదే. మూతి తెరవనంత సేపూ స్వచ్ఛమైన నీరులాగే వుంటుంది. మూడు ముళ్ళు వేసి ఆ కార్క్ తెరవటంతో బుసబుసమని పొంగి పడిపోతుంది. ఇక తెలియని అర్భకులు, నువ్వింత దానివి- అంత దానివి- అంత అందమైన దానివి అంటూ, దాన్ని ఊయలలూపేరో అంతే. ఇక మరీ పొంగి పడిపోతుంది. ఆ తర్వాత వెర్రిముఖం వేయటం మన వంతు. సో బి కేర్‌ఫుల్ విత్ వుమెన్ అండ్ వైన్" అని ఆస్కార్ వైల్డు అన్నట్లు గుర్తు. వైల్డు కాకపోతే మరో గైలు అనే వుంటాడు. ఆదలా ఉంచు.

అసలు ప్రేమకు, మందుకు సంబంధముందోయ్. అసలు ప్రతి మగాడు ఓ వయసులో ప్రేమను తాగుతాడు. ప్రేమ దూరం అయిన తర్వాత, మందును తాగుతాడు. దేవదాసు నుంచి ఈ సత్తిబాబు వరకు అంతే తంతు.

సత్యవతిని నేను ప్రేమించినప్పుడు ఆకాశం, తొలిరేయినాటి మంచానికి పైన పందిరి లాగాను, పచ్చికలన్నీ ఆకుపచ్చ దుప్పటి లాగాను, కాకి కూతలు కూడా కోకిల గీతాల్లాగాను కనిపించేవి, వినిపించేవి.

టు బి ఫ్రాంక్ విత్ యు - అసలు మందు తాగితే అబద్ధం ఆడకూడదని మా ఆనందబాబుగాడు అంటూ వుంటాడు. నిజంగానే చెబుతాను. నేను ప్రేమించే నాటికి ఆమె అంత స్థితిమంతురాలని నాకు తెలియదు. భూమి, పుట్ర- కొంపా, గోడు-

---

## ముద్దు

"మీ పెద్దబాబు కాస్త మొద్దే కదండీ! అయినా మీ ఆయన కెందుకంత ముద్దు వాడంటే" అడిగింది రాజీ వాణిని.

"ఆఁ వాడికన్నీ తన బుద్ధులే వచ్చాయని ఆయన వాడినలా ముద్దు చేస్తుంటాడు" అసలు విషయం బయట పెట్టింది వాణి.

—బి. పద్మజ.

ఆస్థి పాస్థి అన్నీ చూసి ప్రేమిం చటం కాదుటోయ్- ప్రేమించాం, ప్రేమకు అటునుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చేసింది. లేడీస్ హాస్టల్‌లో వార్డెన్‌కి ఆమె ప్రతి సాయంత్రం నాతో షికారుకు రావటం తెలిసి పోయింది. ఆమె పేరెంట్స్‌కి కబురు వెళ్ళిపోయింది. ఆయనగారు దటీజ్- మా మామగారూ, రావటం జరిగిపోయింది. ఒన్ బై ఒన్ చక చకా జరిగిపోయాయి.

ఇవేం గొప్ప విశేషాలు కావు. ప్రతి వాడి జీవితంలోను కాకపోయినా చాలామంది జీవితాల్లో జరుగుతునే ఉంటాయి. అయితే ఎవడి జీవి తానికి వాడికవే మైలు రాళ్ళు.

మైలురాళ్ళు ప్రేమనించి పెళ్ళి కొచ్చాయి. మా ముసల్ది అడ్డు తగిలేసింది. పుల్లేటికుర్రు కొబ్బరి తోటనో, అమలాపురం అరటి తోటనో కట్టుకోమని గోల పెట్టే సింది. గాంధీగారు చెప్పి పోయేరు కదటోయ్. సత్యాగ్రహం- అదీ అన్నం, నీళ్ళు మానేసి అభోజనం కూర్చుండిపోయింది.

గాంధీగారు భోజనం లేకుండా కూర్చునే సరికి, ఉక్కుమనిషి వల్లభాయి పటేల్, పండిట్ జవ హర్‌లాల్ దిగొచ్చారు కదా! ఇక నేనెంత? అందులో అన్నం మానేసి కూర్చున్నది, కన్నతల్లి అయి పోయింది. ఇక రాజీ మార్గానికి రాకతప్పలేదు.

నేను ప్రేమించిన పిల్లను ఆమె ఒప్పుకోవడానికి ఒప్పుకుంది. ఇక మిగిలిందంతా ఆమె ఇష్టమే. కట్నాలు-కానుకలు, దిబ్బా దిడు గుండం, లాంఛనాలు-పెట్టుబడులు అవన్నీ ఆవిడే చూసుకుంది. ఇక నేనేం కలగజేసుకోలేదు. అమ్మా! కట్నం పేరున ముప్పయి వేలు గుంజేవేంటే- అని నేనడగలేదు. ఆడపడుచులు వేరుగా, ఆడపడుచు లాంఛనాలు- వేయినూట పదహార్లు ఏమిటమ్మా!? అని ప్రశ్నించలేదు. పెళ్ళిలో అడుగడుక్కీ బట్టలు పెడితే ఎందుకు పెట్టారని అడగలేదు. అసలు నేనేం కలగజేసుకోలేదు.

అంతెందుకు అలకపాన్పు ఎక్కు! అంటే ఎక్కాను. మా మామ గారొచ్చి అప్పటికే డైలాగ్ కంఠతా పట్టిన నటుడిలా 'బజాజ్ స్కూటర్' ఇస్తాను అనగానే దిగి పోయాను. అసలిది కావాలి అని నేను అడిగానేమో కనుక్కో. నో నెవర్-నేనేదీ అడగలేదు,కోరలేదు. కాని. రోగ్- మా పెద్ద బావమరిది పెళ్ళిలో ఎవరితోటో అంటుంటే మా వాళ్ళు విన్నారు. నేను వాళ్ళ చెల్లాయిని ప్రేమించేనని, షికార్లు

సినిమాలు తిప్పటం వల్ల గతిలేక, వాళ్ళ చెల్లెల్ని నాకిచ్చారట. లేక పోతే వాళ్ళు పెట్టిన ఖర్చు ఇంత కంటె గొప్ప సంబంధం తెచ్చే వారట.

లూజ్‌టాక్ నన్ను హర్టు చేసింది. అయినా క్షమించేశాను. సత్యవతిని పువ్వుల్లో పెట్టి చూసుకున్నాను. పల్లెత్తు మాటని ఎరగను. అయితే ఆమె పన్నెత్తి నన్ను ఏదీ అడగ లేదు.

అంతెందుకు —

తెల్లవారి ఇంటికొచ్చిన నా చొక్కా మీద తిలకం మరకలు ఏమిటని? ఆమె నిలదీయలేదు. ఎప్పుడూ అ పుస్తకాలు చదువుతూ కూర్చుంటా వేంటని ఆమెను నేను కేక వేయ లేదు.

ఎప్పుడైనా సరదాగా పేకాడి, ఏ ఒంటి గంటకో ఇంటికి చేరితే- ఆ వేళకే ఆమె గుర్రు పెడుతూ నిద్ర పోతుండేది. సర్లే- ఏదో పని చేసి అలసిపోయి నిద్ర పోతోందిలే, అనుకుని నన్ను నేను సమాధాన పరచుకొని, నా కోపాన్ని నేనే తగ్గించుకొని' ఊరుకున్నానే తప్పించి ఆమెనెన్నడు తిట్టలేదు. గౌరవించాను. ప్రేమించాను.

మా ప్రేమ పుష్పించింది. దానికి సాక్ష్యంగా ముగ్గురు ఆడ పిల్లలు పుట్టారు. అది ఆమె తప్పు కాదని నాకు తెల్సు. ఐ యామ్ నాట్ కన్సర్‌వేటి- మై ఓల్డు ఉమెన్. ఒంటికాలి మీద నా భార్య మీద లేచినప్పుడల్లా నేను ఊరుకో బెట్టాను. ఆమె కావాలని ఆడాళ్ళని కన్లేదన్నాను.

బట్- యస్, ఏం జరిగింది. కౌన్ కిస్కా- గొట్టం గాడు, వీడి లెక్కేమిటి? కడుపునో మగపిల్లాడు పుట్టినాడు వాడు కొరివి పెడతాడు అనుకుంది. అందుకే స్వతంత్రించింది.

ఐ టెల్యూ గురూ! ఆడది ఆడదే. బీర్ బాటిల్ కార్కు తీసేమో, పొంగి పొరలి పోతుంది.

ఇప్పటికే తను చేసింది తప్పని దట్ రోగ్ ఒప్పుకోవడం లేదు. నన్ను అడక్కుండా వాళ్ళ నాన్నకి గొలుసివ్వటం తప్పు అనటం లేదు. అవకాశం లేకపోయిందట. మీ అమ్మ గారు ప్రాణాపాయంలో వుంటె, మీరు నన్ను అడిగే దాకా ఆగుతారా? అలాగే! ఇదీనూ. నన్ను పెంచి పెద్ద చేసి పెళ్ళి చేసిన కన్నతండ్రి చిక్కుల్లో పడితే, చూస్తూ ఊరుకోలేక పోయానని సమర్థించుకుంటోంది. ఐ హేట్ హర్ గట్స్.

మూడు పేటల గొలుసు నాకు

ప్రధానం కాదు. ఆ డబ్బు నాకు మూడు రోజులు పేకాటకు చాలదు. కాని ఆఫ్టరాల్ ఆడది ఆడదిలా పడుండక పెత్తనాలు వెలగబెడు తుందా? నన్ను ప్రశ్నిస్తుందా? నా కాళ్ళు కడిగిన మా మామ, నా దగ్గర కాలరెత్తుకొని మాట్లాడతాడా? మా బావమరిదిగాడు ఇంత కంటే గొప్ప సంబంధం తేగలమంటాడా? పరిస్థితి తలకిందులయ్యే సరికి ప్లేటు ఫిరాయించి నా పెళ్ళాం నగలు అమ్ముకుంటారా?

ఏమిటయ్యా ఆ నవ్వు? బోయ్ మరో లార్జ్.... కలుపు బీర్ కలుపు. బీర్ అంటే ఏమిటో తెలుసా! ఆడది లాంటిదయ్యా! ఆ పాట్నే-- అలాగే- సేవిస్తే ఒంటికి చల్లదనాన్ని ఇస్తుందయ్యా. అదే దాని పాలిటి .... ఏ రాక్షసి మొగుడు బ్రాందీయో, విస్కీయో, తగిలే ఆ బీర్ కూడా ఆదిశక్తి అయిపో తుందయ్యా!

ఆడది- అమ్మగా మారాలన్నా, ఆది శక్తిగా మారాలన్నా మన చేతిలో ఉందయ్యా. అంతెందుకు- నా సత్య నన్ను దేవుడిలా చూసిందా! గుళ్ళో రాములోరికి సీత సేవ చేస్తుందో లేదో కాని, నన్ను సీతమ్మ వారిలా సేవిస్తుందయ్యా! సారీ! మందు ఎక్కువై మాట తడబడుతోంది. సేవించేది: ఆమె సీతమ్మ వారేమో కానీ నేను రావణాసురిడి లాగా తిరిగాను. కనపడిన ఆడదాన్ని వదలలేదు. ఏ రంభని వదిలి పెట్టలేదు. ఆమె దేవతయితే నేను రాక్షసుడ్ని. రాక్షసుడికి దేవతకి పొత్తు కుదరదు. అందుకే, నాకు, సత్యకి పొత్తు కుదరలేదు. ఓ కుటుంబం కాపాడ్డానికి, ముష్టి మూడు పేటల గొలుసు ఇచ్చిందని, ఆమెనొదులుకున్నాను. నాకు నిష్కృతి లేదు. మందు ఎక్కువై ఏడవటంలేదయ్యా ఇవి కన్నీళ్ళు కావు. నా తప్పు నన్ను లోపల ఉడుకెత్తించి పారేస్తుంటే వచ్చే ఆవిరి నిజం గురూ! మిస్టేక్ ఆఫ్ మి. ఆత్మాభిమానానికి- అంతరాత్మకి మధ్య సంఘర్షణ బాసూ- చూడు గురూ! ఆడది బీర్ బాటల్ లాంటిది.

ం ం ం

పూజ్యులైన నాన్న గారికి, నమస్కారములతో సత్యవతి వ్రాయునది. ఇక్కడ నేను క్షేమం. అక్కడ మీరంతాక్షేమంగా ఉన్నట్లు తలుస్తాను. ఇక్కడ బ్యాంకులో స్టాఫంతా చాలా మంచి వారు. నన్ను బాగా చూస్తున్నారు. నా గురించి మీరు బెంగ పెట్టుకోవద్దు. మీ కాలు. చేయి కొంత స్వాధీనం

లోకి వచ్చినట్టు తలుస్తాను. మీరు బెంగ పెట్టుకోవద్దు. అన్నయ్యే కాదు, నేనూ, మీ కొడుకునే అనుకోండి. దీనితో రెండు వేల డ్రాఫ్ట్ పంపుతున్నాను. లాయర్‌కివ్వండి. మా అత్తగారింటికి నన్ను పంపించాలనే ప్రయత్నంతో గొలుసు విడిపించే ప్రయత్నం చేయకండి.

మూడు పేటల గొలుసు కోసం' మూడు ముళ్ళ బంధం తెంపుకోవడానికి వాళ్ళు సిద్ధపడ్డ తర్వాత, మనం ఎంత ఆపినా అవి తెగక మానవు. ఆ రోజు ఆమె నా మెడలోంచి తెంపుకెళ్ళింది, నాను తాడు, మంగళ సూత్రాన్ని కాదు. ఆమె మీద ఉండే గౌరవాన్ని, అభిమానాన్ని తెంపుకెళ్ళింది. నా పిల్లలు నలుగురూ నాకు బరువు కారు. ఒక్కొక్క సంసారం ఒక్కొక్క వృత్తం. ఆ వృత్తం మరో వృత్తంతో ముడి పెట్టే టంకం, ప్రేమా, అభిమానం. అవి అన్నీ ఉన్నప్పుడు గొలుసుగా సమాజం ఉంటుంది. అవి లేకపోయిన తర్వాత, గొలుసును గొలుసుగా ఉంచటం కష్టం.

తెగిపోయిన గొలుసును కలిపే ప్రయత్నం చేయవద్దు. వారిక్కడే హైదరాబాదులో బారుల్లో తాగి తందనాలాడుతూ, గడియకొక రకంగా మాట్లాడుతూ, శరీరాన్ని గుల్ల చేసుకుంటున్నారట. క్షమించండి, జరగకూడనిది ఏదైనా జరిగితే.... తెగటానికింకేం గొలుసులు లేవు. మెడలో ఉన్న పసుపు కొమ్ము జారిపడడం మినహాయించి, అది నా బతుకు లోను నా పిల్లల బతుకుల్లోను, ఏ మార్పు లేదు.

తెగిన గొలుసుల్ని అతకగలరేమో, తెగిన మనసుల్ని దేవుడూ అతకలేడు. •

మీ
సత్య

---

## వైద్యం

"మా నాన్న ఓ పెద్ద డాక్టర్. వైద్యం చేసి వేలమందిని బ్రతికించాడు" చెప్పాడు గోపి కృష్ణతో.

"మా నాన్న చాలా పెద్ద డాక్టర్. వైద్యం చేయకుండానే లక్షల మందిని బ్రతికించాడు" తాపీగా చెప్పాడు కృష్ణ.

—బి. పద్మజ.